# తప్పుల తడకగా సూచిక బోర్డులు

భీమారం, డిసెంబర్ 9 : తప్పుల తడకగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో ఆవుడం 17 కిలో మీటర్లు, ఆరెపల్లి 10 కిలో మీటర్లు, చెన్నూర్ 12 కిలోమీటర్లని బోర్డులను ఏర్పాటు చేశారు. ఆరెపల్లి క్రాస్ రోడ్డులో ఆరెపల్లి 2 కిలో మీటర్లు, ఆవుడం 17 కిలోమీటర్లు, మంచిర్యాల 25 కిలోమీటర్లు అని నేషనల్ హైవే వారు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ఆరెపల్లి 4 కిలో మీటర్లు ఉండగా 10 కిలో మీటర్ల దూరమని, ఆవుడం 15 కీలో మీటర్లు అయితే 17 కిలో మీటర్లని, చెన్నూర్ 13 కిలో మీటర్లు ఉంటే 12 కిటో మీటర్లు అని తప్పుగా బోర్డులను ఏర్పాటు చేశారు. ఆరెపల్లి క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో ఆరెపల్లి 4 కిలో మీటర్లు అయితే 2 కిలో మీటర్లు అని బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డులు 150 మీటర్లు ఉండడం గమనార్హం నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం ఎంత ఉంది అనేది. సూచిక బోర్డులతో తెలుస్తోంది.



ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు



ఆరెపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

## భజన మండలి ఎన్నిక

కోటపల్లి, డిసెంబర్ 9 : మండలంలోని లింగన్నపేటలోని అభయ వీరాంజనేయ స్వామి భజన మండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్ దాగామ రాజు, భజన మండలి జిల్లా సభ్యులు వెంకటాచారి, రమేషాచారిల సమక్షంలో భజన మండలి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాళ్లబండి రామచంద్రు, ఉపాధ్యక్షుడిగా కొత్తవడ్ల మహేశ్ చారి, కార్యదర్శిగా బిల్కి సుధాకర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. భజన మండలి సభ్యులను సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో సన్మానించారు.

## గిరిగ్రామాలకు ఆర్టీసీ బస్సు నడిపించాలి


కాసిపేట : మాట్లాడుతున్న ఆదివాసీ గామస్తులు, నాయకులు

కాసిపేట, డిసెంబర్ 9 : కాసిపేట మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలకు ఆర్టీసీ బస్సును నడిపించాలని ఆదివాసీ గిరిజన గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీలోని ఆదివాసీ గిరిజన గ్రామస్తులు, ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల మీదుగా గట్రావ్‌పల్లి వరకు ఆర్టీసీ బస్సు నడిచేదని, కానీ ఇప్పుడు బస్సు నడవడం లేదన్నారు. బస్సు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించడం సంతోషకరమే, కానీ ఆదివాసీ గూడాలకు బస్సు సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఆదివాసీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన ప్రధాన కార్యదర్శి సిడం గణపతి, ఉపాధ్యక్షుడు పెంద్రం ప్రభాకర్, నాయకులు సిడం మోహన్, ఆడె సంపత్, సిడం కృష్ణ, కుడిమేత రవీందర్, సిడాం రమేశ్, కుడిమేత సావిత్రిభాయి, మంజులాభాయి, భీంభాయి, కాసుభాయి, ఆదివాసీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళ లకు చట్టాలపై అవగాహన

జైపూర్, డిసెంబర్ 9: మండలకేంద్రంలో గల సింగరేణి విద్యుత్ కేంద్రంలో పని చేస్తున్న మహిళలకు లైంగిక వేధింపులు నిషేధం, నివారణ చట్టంపై ఎస్టీపీపీ చైర్‌పర్సన్ ఆశ శనివారం అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు పూర్తిగా నిషేధమని, వేధింపులకు పాల్పడ్డ వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీపీపీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారిణి


ఆరోబోసిన ధాన్యం కుప్పలు

# సన్నరకం ధాన్యానికి భలే డిమాండ్

- క్వింటాల్‌కు రూ.3000 వేల పైనే

నెన్నెల, డిసెంబర్ 9 : ఈ ఏటా సన్నరకం ధాన్యానికి భారీగా డిమాండ్ పెరిగింది. సన్న రకాలలో జైశ్రీరాం, కావేరిచింటు రకాలకు మార్కెట్‌లో మంచి డిమండ్ ఉండటంతో రోజురోజుకు ధర పెరుగుతోంది. కొంతకాలంగా సన్నరకాలకు అధికంగా తెగుళ్లు వచ్చి దిగుబడి అంతరాక పోయేది. కానీ ఈయేడు దిగుబడి కూడా అధికంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది క్వింటాల్‌కు రూ.2400ల నుంచి .2500 వరకు ధర ఉండగా ఇప్పుడు మార్కెట్ లో కళ్లాల మీదనే రూ.3000 వేలు పెట్టి దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి సిద్దిపేట, సిరిసిల్ల, నల్లగొండ కరీంనగర్, మెదక్ జిల్లాలోని రైస్ మిల్లర్లు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. దళారులే పోటీపడి ఇంత ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారంటే రైస్‌మిల్లర్ల వద్ద మరో రూ.200 వందల పైనే ధర ఉంటుందని పేర్కొంటున్నారు. దాదాపు రూ.3200 లనుంచి 3500ల ధర ఉం టుందని రైతులు అంటున్నారు. ఇతర సన్నరకాలు కూడా రూ.2500 ల నుంచి 2600ల వరకు ఉంది. ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# లబ్ధిదారులతో ప్రధాని వీడియోకాన్ఫరెన్స్


బెల్లంపల్లిరూరల్: ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ను తిలకిస్తున్న రైతులు,లబ్ధిదారులు

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 9: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా శనివారం బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం లో ప్రభు త్వ పథకాల లబ్ధిదారులతో భారత ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్‌లో ముచ్చటించే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే బెల్లంపల్లి కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ, వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ప్రభుత్వ శాఖలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రతీ మూలకు ప్రభుత్వ కార్యక్రమాలను సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేసి సమగ్ర సామాజిక,ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటునందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్తలు డా.తిరుపతి, డా.నాగరాజు, బోధనేతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కోటపల్లి : రాంపూర్‌లో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న తనిఖీ బృందం

## కొనసాగుతున్న సోషల్ ఆడిట్

కోటపల్లి, డిసెంబర్ 9 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ మండలంలో కొనసాగుతున్నది. 2022 జనవరి నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలో సుమారుగా ఆరు కోట్లకు పైగా పనులు జరుగగా ఎస్ఆర్‌పీ రవి ఆధ్వర్యంలో తనిఖీలను నిర్వహిస్తున్నారు. మొత్తం 14 బృందాలు గ్రామాల్లోకి వెళ్లి ఉపాధిపనులపై తనిఖీలు జరుపుతున్నారు. తనిఖీలు పూర్తైన గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి తనిఖీ నివేదికలను చదివి వినిపిస్తున్నారు. తనిఖీలు పూర్తైన అనంతరం మండలకేంద్రంలో ప్రజా వేదికను ఏర్పాటు చేసి నివేదికలను తనిఖీ బృందం చదివి వినిపించనున్నారు.

## ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 9 : బెల్లంపల్లి మండలంలోని బుగ్గ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి తమ గ్రామం నుంచి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని గోండుగూడెం గ్రామస్థులు కోరుతున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు వారు వాపోతున్నారు. తమ గ్రామానికి సమీపంలోనే బుగ్గ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ఉన్నప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆలయానికి వెళ్లలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు గోండుగూడెం నుంచి బుగ్గ వరకు రోడ్డు సౌకర్యం కల్పించి బెల్లంపల్లి మండలంలోని అంకుశం, గోండుగూడెం, తాండూర్ మండలంలోని బోయపల్లి, తాండూర్, రేచిని గ్రామాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులను తీర్చాలని వారు కోరుతున్నారు.

## పత్తి సేకరణలో రైతులు బిజీబిజీ

వేమనపల్లి,డిసెంబర్ 9 : వేమనపల్లి మండల కేంద్రంతో పాటు జిల్లెడ, సూరారం, నాగారం, బుయ్యారం తదితర గ్రామాల్లో రైతులు పత్తి సేకరణలో బిజీబిజీగా గడుపుతున్నారు. నాలుగు రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడగా పత్తిని సేకరించకుండా వదిలేశారు. శనివారం నుంచి ఎండ కాస్తుండడంతో కూలీలతో కలిసి పత్తిని సేకరిస్తున్నారు. రైతులందరూ ఒకేసారి పత్తి పంటలు వేయడంతో ప్రస్తుతం కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు దూర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువచ్చి కిలోకు రూ.10 చొప్పున పత్తిని ఏరిపిస్తున్నారు. రానుపోను వాహనాల ఖర్చులను కూడా అందజేస్తున్నారు.

## సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలి

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 9: సాంఘిక సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఈనెల 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే జోనల్ స్థాయి (కాళేశ్వరం జోన్ 2023) సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప కోరారు. కమ్యూనిటీ హెల్త్ అండ్ ఎన్వీరాన్‌మెంట్, ఎనర్జీ రిసోర్స్అండ్ కన్జర్వేషన్, ఎన్వీరాన్‌మెంటల్ ఇష్యూ అండ్ కన్సర్వ్, నాచురల్ రిసోర్స్ అండ్ కన్జర్వేషన్, గుడ్‌హెల్త్ అండ్ వెల్‌బీయింగ్, క్లీన్‌వాటర్ అండ్ శానిటేషన్ అనే అంశాలపై ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలల, పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను సైన్స్‌ఫేర్‌కు తీసుకువచ్చి తిలకించేలా చూడాలని కోరారు. ఈ సైన్స్‌ఫేర్‌లో 23 బాలుర, 35 బాలికల సంక్షేమ పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

## 14న రేణుకా ఎల్లమ్మదేవీ విగ్రహ ప్రతిష్ఠ

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 9: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలోని తాటి వనంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో రేణుకా ఎల్లమ్మ దేవీ విగ్రహప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 14న నిర్వహిస్తామని స్థానిక సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్ తెలిపారు. సోమవారం గణపతి పూజ, హారతి, మంత్ర పుష్పం, 12న మంగళవారం గణపతి పూజ, రక్ష బంధన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, అగ్ని ప్రతి ష్ఠ, 13న నిత్య పూజలు, మూలమంత్ర హవనములు, పంచామృత అభిషేకం, తీర్థ ప్రసాద వితరణ. 14న గురువారం ఉదయం 4 గంటలకు రేణుక ఎల్లమ్మ దేవీ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం, హారతి, అన్నదానం కార్యక్రమం ఉటుందని సర్పంచ్ తెలిపారు. గౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయంలో 24న ఆదివారం పోచమ్మ బోనాలు, 25న సోమవారం ఎల్లమ్మ జోగు, 26న మంగళవారం ఎల్లమ్మ పెద్దబోనం, 27న బుధవారం ఎల్లమ్మ కల్యాణం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడకులస్థులు కోరారు.